## క్లుప్తంగా

### వేంకటేశ్వరస్వామికి రూ.10,116 సమర్పణ



అంగరలో వేంకటేశ్వరస్వామికి రూ.10,116 అందజేస్తున్న దాత

కపిలేశ్వరపురం: అంగరలోని గోదాదేవీ సమేత వైభవ వేంకటేశ్వరస్వామికి ఆలయ నిర్వహణ నిమిత్తం భక్తుడు వంగా కామేశ్వరరావు, ఆయన కుమారుడు శ్రీనివాసులు రూ.10,116 సమర్పించారు. ఆలయంలో సోమవారం స్వామిని దర్శించుకుని నగదును ఆలయ నిర్వాహక కమిటీ కార్యదర్శి పెద్దింశెట్టి రామ స్వామికి సొమ్మును అందజేశారు. దాతను ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు గుడిమెట్ల శంకర్, వెల్ల శ్రీనివాస్, పెద్దింశెట్టి వీరబాబు అభినందించారు.

### ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి

కపిలేశ్వరపురం: టేకిలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) ఉపాధ్యాయ సంఘం నూతన వార్షిక క్యాలెండర్‌ను ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి సోమవారం ఆవిష్కరించారు. సంఘం నాయకులు కె.రామచంద్ర, కె.వెంకటరమణ, ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘం విశేషంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మేడిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

### అక్రమ మద్యం సీసాలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

రామచంద్రపురం: యానం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను ఎక్సైజ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రపురం పట్టణానికి చెందిన పప్పుల శ్రీనివాసరావు యానాం నుంచి సుంకం చెల్లించని 28 అక్రమ మద్యం సీసాలను వాహనంలో రామచంద్రపురం తరలిస్తూ అన్నాయిపేట వద్ద నిర్వహిస్తున్న తనిఖీల్లో పట్టుబడ్డారని చెప్పారు. నిందితుడిని రామచంద్రపురం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించి సబ్ జైల్‌కు తరలించారన్నారు. తనిఖీల్లో ఎస్ఐ రవికుమార్, ఎస్.శ్రీనివాసరాజు, మహిళా పోలీస్ బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### నేడు అంగరలో గడపగడపకూ..

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడతారని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు కముజులవారి కాలనీ నుంచి పర్యటన ప్రారంభమవుతుందని, పర్యటన సమయంలో అధికారులందరూ అందుబాటులో ఉంటారని ఎంపీడీఓ తెలిపారు.

### రేపు ఏవీఆర్‌వీపీఆర్ కళాశాలలో జాబ్‌మేళా

మండపేట: పట్టణంలోని ఏవీఆర్‌వీపీఆర్ కళాశాల, వికాస సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో లోడర్స్, డ్రైవర్లు, ఏసీ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలో ట్రైజర్స్, ఆపరేటర్స్, వెల్డర్స్, పెయింట్స్, టైర్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలో ఆపరేటర్, టెక్నీషియన్, హోండాయ్ మోబీస్లో టెక్నీషియన్, ఎన్‌వీహెచ్ సంస్థలో ట్రైనీ తదితర పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఆయా ఉద్యోగాలను బట్టి డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఇచ్చి నెలకు రూ.10,000 నుంచి రూ.18,000 వరకు జీతం, రవాణా సదుపాయం కల్పిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక రావులపేటలోని ఏవీఆర్‌వీపీఆర్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. అదనపు సమాచారం కోసం 79890 57588 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

## ఎంపీ అనూరాధకు కృతజ్ఞతలు



మొగళ్ళమూరులో ఎంపీ అనూరాధకు కృతజ్ఞతలు తెలుపుతున్న పద్మశాలీ సంఘం నాయకులు

కపిలేశ్వరపురం: తమ సామాజిక వర్గీయుల ప్రయోజనార్థం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన అమలాపురం ఎంపీ చింతా అనూరాధకు అంగర పద్మశాలీ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అంగరలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎంపీ అనూరాధ రూ.10 లక్షలు మంజూరు చేశారు. సంఘ నాయకుడు బండారు మహాలక్ష్మీశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ నేతలు మొగళ్ళమూరులోని ఎంపీ నివాసానికి వెళ్ళి కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్ బ్యాడ్మింటన్‌లో రమ్యశ్రీకి ప్రథమస్థానం

రాయవరం: మండలంలోని వెదురుపాకకు చెందిన కాకి రమ్యశ్రీ రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం వీఎస్ సునీత, పీడీ కృష్ణ ప్రసాద్‌లు సోమవారం విలేకరులకు తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న రమ్యశ్రీ తన ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రమ్యశ్రీని సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయిరెడ్డి, పీఎంసీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ తదితరులు అభినందించారు.



రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన రమ్యశ్రీ

# పింఛన్.. మది మురిపించెన్

- అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్లు మంజూరు
- మండపేట నియోజకవర్గానికి 1,261
- రామచంద్రపురం నియోజకవర్గానికి 1,839
- ఈ నెల నుంచి పింఛన్ సాయం రూ.2,750కు పెంపు

మండపేట: కులం చూడం.. మతం చూడం.. రాజకీయాలు చూడం.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని ఆచరణలో చేసి చూపిస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పేదరికమే ప్రామాణికంగా ఎప్పటికప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో పాటు పింఛన్ సాయాన్ని పెంచుకుంటూ వస్తున్నారు. ఈ నెల నుంచి రూ.2,750లు పంపిణీ చేస్తున్నారు.

టీడీపీ హయాంలో పింఛన్ల కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రసహనంగా సాగేది. జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. 1వ తేదీ నుంచి పింఛన్ నగదు కోసం కమ్యూనిటీహాళ్లు, ఆలయాల వద్ద వృద్ధులు, దివ్యాంగులు పడిగాపులు పడేవారు. ఒక్కోసారి వారంపది రోజుల వరకూ సైతం సాయం అందక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారుల ఎదురుచూపులకు చరమగీతం పాడారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. ప్రతి నెలా 1వ తేదీ పొద్దు పొడవక ముందే వలంటీర్లు ఇంటికే వచ్చి ప్రభుత్వ సాయాన్ని అందిస్తుండటం, ఏటికేడు పింఛన్ సాయాన్ని పెంచుకుంటూ వస్తుండడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మండపేటలో లబ్ధిదారునికి పింఛన్ సాయం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

| మండలం | ప్రస్తుతం | కొత్తగా మంజూరైనవి |
|---|---|---|
| మండపేట రూరల్ | 11,453 | 360 |
| మండపేట అర్బన్ | 6,768 | 189 |
| రాయవరం | 9,696 | 368 |
| కపిలేశ్వరపురం | 9,460 | 344 |
| రామచంద్రపురం అర్బన్ | 4,233 | 305 |
| రామచంద్రపురం రూరల్ | 10,163 | 354 |
| కె గంగవరం | 9,803 | 363 |
| కాజులూరు | 9,726 | 817 |

**కొత్త పింఛన్లు మంజూరు**

మండపేట నియోజకవర్గంలో ప్రస్తుతం 37,377 మంది లబ్ధిదారులు ఉండగా కొత్తగా 1,261 పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో నియోజకవర్గంలోని లబ్ధిదారుల సంఖ్య 38,638కు పెరిగింది. రామచంద్రపురం నియోజకవర్గంలో 33,925 పింఛన్లు ఉండగా కొత్తగా మంజూరైన 1,839 పింఛన్లతో కలిపి లబ్ధిదారుల సంఖ్య 35,764కు పెరిగింది. పింఛన్లు తొలగిస్తున్నారంటూ ప్రతిపక్ష నేతలు దుష్ప్రచారం చేస్తుండగా రెండు నియోజకవర్గాల పరిధిలో 3,100 పింఛన్లు కొత్తగా మంజూరు కావడం గమనార్హం. ఎన్నికల్లో మాట ఇచ్చినట్టుగానే ప్రస్తుత నెల నుంచి పింఛన్ సాయాన్ని రూ.250లు పెంచి ఈ నెల నుంచి లబ్ధిదారులకు రూ.2,750లు అందజేస్తున్నారు. పాత లబ్ధిదారులతో పాటు కొత్తగా మంజూరైన వారికి ఈ సొమ్ము అందిస్తున్నారు.

## డ్రెయిన్లు ఇలా.. మురుగునీరు పోయేదెలా?

- పూడికలతో డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి ఆటంకం
- నారుమడులు, వెదచల్లిన పొలాల్లో నిలిచిపోతున్న నీరు

కాజులూరు: పొలాలకు సాగునీరందించే పంట కాలువలు ఎంత ముఖ్యమో, చేలోని మురుగునీటిని బయటకు తరలించే డ్రెయిన్లు, మురుగుకాలువలు అంతే ముఖ్యం. అయితే రామచంద్రపురం నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లోని డ్రెయిన్లు తూటుకాడ, గుర్రపుడెక్కలతో పూడికలు పెరిగిపోయి నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు ప్రస్తుతం పంటదమ్ములు పూర్తి చేసుకుని నారుమడులు, వెదచల్లికల పనిలో ఉన్నారు. గింజ వేరునాటే సమయంలో పొలంలో నీరు నిలిచిపోతే మొక్క మొలవకుండా గింజ కుళ్లిపోతుంది. ప్రస్తుతం డ్రెయిన్లలో పూడికల కారణంగా పొలాల్లో నీరు నిలిచిపోతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

కాజులూరు మండలంలోని టేకి, తుల్యభాగ, ఆత్రేయ గోదావరి, కూరాడ తదితర ప్రధాన డ్రెయిన్లతో పాటు తేనెలగొంది, శీల డ్రెయిన్, రాజు డ్రెయిన్, టి.మామిడాడ, వజ్రకాలువ, దుగ్గుదుర్రు తదితర మైనర్ డ్రెయిన్లలో సైతం పూడికలు పెరిగిపోయి ఉన్నాయి. దీంతో ఎగువ నుంచి వచ్చి చేరే మురుగునీరు ఇక్కడ పొలాలను ముంచెత్తుతుంది. పొలాల్లో చేరుతున్న మురుగునీరు రోజుల తరబడి ఉండిపోవడంతో వెదచల్లిన పొలాలు, నారుమడులలో చల్లిన విత్తనాలు మొలకలు రాకుండా కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా కాజులూరు మండల పరిధిలోని కూరాడ డ్రెయిన్ పరిస్థితి మరీ ఆందోళనకరంగా మారింది. ఈ డ్రెయిన్ రామచంద్రపురం, కరప మండల గ్రామాల నుంచి ప్రవహిస్తూ మండలంలోని ఆర్యావటం, గొల్లపాలెం, మొగలిపాలెం, శలపాక మీదుగా తణుకువాడ వద్ద తుల్యభాగ డ్రెయిన్‌లో కలిసి సముద్రంలో చేరుతుంది. టి.మామిడాడ, మతుకుమిల్లి, బందనపూడి, ఆర్యావటం, మంజేరు, కరప మండలం పెద్దాపురపాడు గ్రామాల్లోని సుమారు 15 వేల ఎకరాల్లోని మురికినీరు, ముంపు నీరు డ్రెయిన్ ద్వారా బయటకు వెళుతుంది. డ్రెయిన్ పొడవునా గుర్రపుడెక్క, తూటుకాడ పెరిగిపోయి నీటిప్రవాహానికి అవరోధంగా మారడంతో తమకు తిప్పలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్‌లను శుభ్రం చేయించి పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.



మొగలిపాలెం వద్ద పూడికలతో నిండిపోయిన కూరాడ డ్రెయిన్

**నారు మొలవటం లేదు**



డ్రెయిన్లలో పూడికల కారణంగా పొలాల్లో నీరు నిలిచిపోవడంతో నారు మొలవడం లేదు. పంటకు రెండుమూడుసార్లు నారుమడులు వేసుకోవాల్సి వస్తుంది. దీనివల్ల దాళ్వా సాగుకు తీవ్ర జాప్యమై చివరి దశలో సాగునీటి ఎద్దడికి గురికావలసి వస్తుంది. మరోపక్క తరచూ విత్తనాలు చల్లాల్సి రావడంతో విత్తన కొరత ఏర్పడుతుంది.

– ఎస్.బుల్లివెంకటరెడ్డి, రైతు, బందనపూడి

**తీవ్రంగా నష్టపోతున్నాం**



పూడికపోయిన డ్రెయిన్ల కారణంగా డెల్టా ప్రాంతంలోని రైతులు తీవ్రంగా నష్టపోవలసి వస్తుంది. మురుగునీరు ముందుకు పారక పంట చేతికందే సమయంలో తుఫాన్లు వచ్చినపుడు పొలాన్ని ముంచెత్తుతుంది. అలాగే నారు మడుల సమయంలో గింజ మొలవక నష్టపోతున్నాం.

– నల్లమిల్లి చంద్రారెడ్డి, రైతు, మొగలిపాలెం

## పూలే విగ్రహాన్ని ఫ్లెక్సీలతో మూసేస్తున్నారు

మండపేట: బీసీల ఆరాధ్య దైవం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఫ్లెక్సీలతో మూసేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, జాతీయ క్రమశిక్షణ చైర్మన్ కోన సత్యనారాయణ అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని పెదకాలువ వంతెన వద్ద ఉన్న పూలే విగ్రహం వద్ద కొందరు న్యూ ఇయర్, సంక్రాంతి శుభాంక్షలు పేరిట ఫ్లెక్సీలు కట్టి విగ్రహం కనిపించకుండా మూసేశారని చెప్పారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఫ్లెక్సీలు కట్టిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**నేడు సావిత్రిభాయి పూలే జయంతి**

సావిత్రిభాయి పూలే 191 జయంతి వేడుకలు మంగళవారం మండపేటలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సంఘ నాయకులు తెలిపారు. ఉదయం పూలే విగ్రహం వద్ద జరిగే వేడుకలకు అధిక సంఖ్యలో బీసీలు తరలివచ్చి వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు మల్లువలస గణపతి, గెద్దాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బీసీ నేతలు

## రీజినల్ ఇన్‌చార్జిగా మౌసి



రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రీజినల్ ఇన్‌చార్జిగా షేక్ మౌసి నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. రాయవరం మండలం కురకాళ్లపల్లి సచివాలయంలో పశు సంవర్ధకశాఖ సహాయకుడిగా మౌసి విధులు నిర్వహిస్తున్నారు.

ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జానీపాషా షేక్ నుంచి ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు తెలిపారు. పశు సంవర్ధకశాఖ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడుగాను తాను ఎంపికైనట్లు తెలిపారు. దీనికి సంబంధించి అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ బి.సేవానాయక్ నియామక ఉత్తర్వులు అందజేశారని చెప్పారు.

## దాతల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

కాజులూరు: దాతల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటూనే విద్యలో ప్రతిభ కనబరుస్తున్న పలువురు పేద విద్యార్థులకు అమెరికాకు చెందిన ఏపీటీఏ (అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్) ఉపకార వేతనాలు అందిస్తుంది. కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన యాళ్ళ సంధ్యారాణి(రూ.18,000), కె.గౌరీ కల్యాణి(రూ.12,000), నున్న సునీత(రూ.10,000), కర్రి దుర్గమ్మ(రూ.10,000), కోన రాణి (రూ.10,000), బండారు విజయ(రూ.10,000) చొప్పున ఏపీటీఏ నుంచి ఉపకార వేతనాలు పంపించగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ విద్యార్థులకు అందజేశారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

## ఆలయ రథం ప్రారంభోత్సవం

బిక్కవోలు: ఆరికరేవుల గ్రామంలోని శివాలయానికి దాతలిచ్చిన రథానికి సోమవారం ప్రారంభోత్సవం చేశారు. గ్రామానికి చెందిన తొండాపు సూర్యనారాయణరెడ్డి, లత దంపతులు రూ.12 లక్షలతో రథం తయారుచేయించి ఆలయానికి అందించారు. ఈ సందర్భంగా రథానికి పూజలు చేసి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు తొండాపు గాంధీ, సర్పంచ్ రెడ్డి నాగవీరవేణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మండపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



భక్తుల నుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న పీఠాధిపతి గాడ్



వేంకటేశ్వరుని ఆలయంలో అర్చకుల ఆశీర్వచనాలు తీసుకుంటున్న మంత్రి వేణు



వట్రపూడిలో భజన చేస్తున్న మహిళలు

# కమనీయం.. ఉత్తర ద్వార దర్శనం

- ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
- కిటకిటలాడిన ఆలయాలు

మండపేట: ముక్కోటి ఏకాదశి పర్వదిన వేళ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని దివ్య దర్శనం భక్తజన హృదయాలను పులకింపజేసింది. సోమవారం ఉత్తర ద్వారం ద్వారా వేంకటేశ్వరుని దివ్య మంగళ రూపం భక్తులకు కనువిందు చేసింది. ఆలయాలన్నీ గోవింద నామ స్మరణతో మారుమోగాయి.

ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండపేట పట్టణంలోని ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. తెల్లవారుజాము నుంచి వేలాది మంది భక్తులు స్వామిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఆలయ కమిటీ చైర్మన్ పాలా బుజ్జి, ఆలయ ఈఓ కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బురగుంట చెరువు వద్ద గల సీతారామ క్షేత్రంలోని రామాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. అర్తమూరు వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేశవరంలో వైఎస్సార్‌సీపీ నేత అబ్బిరెడ్డి వీర్రాజు ఆధ్వర్యంలో ఏకాహం ఘనంగా జరిగింది.

రాయవరం: వైకుంఠ ద్వార దర్శనం ముక్తికి మార్గమని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) పేర్కొన్నారు. ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా సోమవారం పీఠంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి గాడ్ మాట్లాడుతూ ఏకాదశి పర్వదినం శ్రీమహావిష్ణువుకు ఎంతో ప్రీతికరమని, ముక్కోటి ఏకాదశుల పుణ్యఫలం ఒక్క రోజున లభించేలా చేసేదే ముక్కోటి ఏకాదశిగా ఆయన పేర్కొన్నారు. పీఠంలోని శ్రీదేవి, భూదేవి సమేత విజయవేంకటేశ్వరస్వామికి పీఠం అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) ఆధ్వర్యంలో భక్తులకు ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. ముక్కోటి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వాడవాడలా స్వామిని కీర్తిస్తూ భజన పాటలతో ఏకావహాలు నిర్వహించారు. సోమేశ్వరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని పూలతో నయనానందకరంగా అలంకరించారు.

**ప్రత్యేక పూజలు చేసిన మంత్రి వేణు**

రామచంద్రపురం: పట్టణంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దంపతులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకుని ప్రతేక పూజలు చేశారు. అర్చకులు మంత్రి వేణు దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. రాజగోపాల్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ముక్కోటి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. శాంతినగర్‌లో కొలువైయున్న వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

కపిలేశ్వరపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల వద్ద ఏకాహ భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయాల అర్చకులు స్వామివార్లను సుందరంగా అలంకరించారు. కోరుమిల్లి, మాచర, కపిలేశ్వరపురంలలోని నవ జనార్దనాలయాలు, అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి, వెదురుమూడి, కాలేరు, నల్లూరు గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

కాజులూరు: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని సోమవారం కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో వైష్ణవ ఆలయాల్లో భక్తులు పూజలు ఘనంగా నిర్వహించారు. కాజులూరు, గొల్లపాలెం, అయితపూడి, శీల, కోలంక గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనాలు చేసుకున్నారు. గొల్లపాలెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు సర్వే రామకృష్ణమాచార్యులు, సర్వే అరవింద్‌లు స్వామికి చామంతి పూలతో సహస్రనామార్చన నిర్వహించారు.



రామచంద్రపురం శాంతినగర్‌లో ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి



విజయదుర్గాపీఠంలో భక్తులకు దర్శనమిచ్చిన విజయవేంకటేశ్వరస్వామి

**కాళేశ్వర ఘట్టం వద్ద ముక్కోటి ఏకాదశి**

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కాళేశ్వరస్వామి ఘట్టం వద్ద ముక్కోటి ఏకాదశి మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ద్రాక్షారామ మాసశివరాత్రి కమిటీ వ్యవస్థాపకుడు సాంబశివగురుస్వామి ఆధ్వర్యంలో కుంభాభిషేకం, కొసనా మోతీలాల్‌చే సత్సంగ ప్రసంగం నిర్వహించారు.

కె.గంగవరం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పామర్రు, సత్యవాడ, కె.గంగవరం, భట్లపాలిక, కుడుపూరు, పేకేరు తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద ఏకాహం, భజనలు నిర్వహించారు. కె.గంగవరంలోని భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద దాతలు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అద్దంపల్లి శివారు వట్రపూటిలోని కోదండరామ స్వామి ఆలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు భజన కార్యక్రమం నిర్వహించారు.